సాక్షి పశ్చిమగోదావరి

గురువారం : 19 : జూన్ : 2025



పిడుగులు.. తస్మాత్ జాగ్రత్త

వర్షాకాలం పిడుగులు పడే అవకాశాలు ఎక్కువ. తగు జాగ్రత్తలు తీసుకుంటే పిడుగు ప్రమాదాన్ని నివారించవచ్చని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. 10లో ▸



కోకో గింజల దొంగల అరెస్ట్

ద్వారకా తిరుమల మండలంలో కోకో గింజల చోరీ కేసులో నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 430 కిలోల కోకో గింజలు స్వాధీనం చేసుకున్నారు. 10లో ▸



అదుపు తప్పిన కారు

ద్వారకా తిరుమల వెళ్తున్న కారు అదుపుతప్పి రోడ్డు మార్జిన్‌లోకి దూసుకెళ్లి, టైల్స్ షాపును ఢీకొట్టింది. ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా, ఒకరు స్వల్పంగా గాయపడ్డారు. 10లో ▸

కొల్లేరు సమస్యలపై మొర

- సీఈసీ బృందానికి వినతుల వెల్లువ
- ఏలూరు కలెక్టరేట్‌కు పెద్ద ఎత్తున కొల్లేరు వాసులు
- భూములపై హక్కులుండేలా చూడాలని విజ్ఞప్తి



సాధికారత కమిటీని కలిసేందుకు బారులుతీరిన కొల్లేరు ప్రాంత మహిళలు



కొల్లేరు గ్రామస్తుల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న కమిటీ సభ్యుడు చంద్రప్రకాష్ గోయల్

ఏలూరు(మెట్రో): సుప్రీంకోర్టు ఆదేశాలతో కొల్లేరుపై కేంద్రం నియమించిన సాధికారత కమిటీ బుధవారం కొల్లేరు వాసులు, నేతల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. కొల్లేరు ప్రాంతంలోని ప్రజల జీవన స్థితిగతులు, వారి సమస్యలను ఆ ప్రాంతానికి చెందిన మహిళలు, మత్స్యకారులు, రైతులు, ప్రజాప్రతినిధులు ఏలూరు కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశపు హాలుకు బుధవారం తరలివచ్చి తమ గోడును వెళ్లబోసుకున్నారు. కేంద్ర సాధికారత కమిటీ గౌరవ సభ్యుడు చంద్రశేఖర్ గోయల్, సభ్య కార్యదర్శులు జె.ఆర్.భట్, జి.భానుమతి, కమిటీ సభ్యులు సునీల్ లిమాయే, ప్రకాష్ చంద్ర భట్‌లకు విన్నవించుకున్నారు.

జిరాయితీ, డీ–ఫాం భూములు మినహాయించాలి

పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు స్థానికులకు జీవనోపాధితో పాటు భూములపై హక్కులు ఉండేలా చూడాలని వినతి పత్రాలు అందజేశారు. అభయారణ్యంలోని జిరాయితీ డీ–ఫామ్ భూములు మినహాయించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఫిష్ ఫార్మర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నంబూరి వెంకటరామరాజు మాట్లాడుతూ.. కొల్లేరులో పర్యావరణ, పక్షులను కాపాడేది రైతులేనని, కొల్లేరు అభయారణ్యం నోటిఫికేషన్ విడుదల చట్టంగా రూపొందించే సమయంలో పరిణామాలపై ఆ ప్రాంత ప్రజలకు ఎలాంటి అవగాహన కలిగించలేదన్నారు. అందుకే ఈ పరిస్థితి వచ్చిందన్నారు. కొల్లేరు ప్రాంతంలోని కాలువలు, డ్రెయిన్లలో చెత్తను తొలగించని కారణంగా, సరైన నిర్వహణ పనులు చేపట్టక ఏటా వరదల సమయంలో కొల్లేరు ప్రాంతం ముంపునకు గురవుతుందన్నారు. కొల్లేరు ప్రాంతంలో లక్షలాది మంది ప్రజలు జీవిస్తున్నారని, ప్రజల పౌర హక్కులకు, జీవన విధానాలకు ఎలాంటి భంగం కలగకుండా మానవీయ కోణంతో చూడాలన్నారు. శివాజీ మాట్లాడుతూ కొల్లేరు ప్రాంతంలో 122 గ్రామాలున్నాయని, అధికశాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలకు చెందిన ప్రజలున్నారన్నారు. కొల్లేరు అభయారణ్యం చట్టం చేసినప్పుడు ఆ ప్రాంత ప్రజలకు కనీస అవగాహన కలిగించలేదన్నారు. ఆ సమయంలో ఒకే ఒక వ్యక్తి స్పందించారని, దీనినిబట్టి కొల్లేరు చట్టంపై ఏ విధమైన అవగాహన కలిగించారన్నది స్పష్టం అవుతుందన్నారు.



కమిటీ సభ్యులకు కొల్లేరు ప్రాంత ప్రజల సమస్యలు వివరిస్తున్న రైతు నంబూరి వెంకటరామరాజు

కొల్లేరు అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేయాలి

కైకలూరు శాసనసభ్యులు కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ కొల్లేరు ప్రాంతంలో నివసిస్తున్న ప్రజల సమస్యలను సానుకూల దృక్పథంతో పరిశీలించి వారికి న్యాయం జరిగేలా చూడాలని కమిటీని కోరారు. కొల్లేరు అభివృద్ధి బోర్డు ఏర్పాటుచేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ కొల్లేరు అభయారణ్య పరిధిలోని 14 వేల ఎకరాల జిరాయితీ భూమిదారులు, 20 వేల ఎకరాల డీ–ఫారం పట్టాదారుల హక్కులను కాపాడాలన్నారు. కాంటూర్ పరిధిని తగ్గిస్తామని హామీ ఇచ్చారని, కానీ అది అమలు జరగలేదన్నారు. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, అటవీ శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనంతరాము, అటవీ ప్రిన్సిపాల్ చీఫ్ కన్‌రు్వేటర్ అజయ్ కుమార్ నాయక్, మత్స్యశాఖ కమిషనర్ రమాశంకర్ నాయక్, కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్, డీఎఫ్‌ఓలు శుభం, విజయ తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్ష

కేంద్ర సాధికారత కమిటీ సభ్యులు బుధవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ గోయల్ మాట్లాడుతూ ఉప్పుటేరులోకి కలిసే ఇరిగేషన్ డ్రెయిన్లు, డ్రెయిన్ల ద్వారా కొల్లేరులోకి వచ్చే కాలుష్యం నివారణకు తీసుకుంటున్న చర్యలు, డ్రెయిన్ల డీసిల్టింగ్‌పై నివేదిక సమర్పించాలని ఇరిగేషన్ శాఖ ఎస్ఈ నాగార్జునరావును ఆదేశించారు. కొల్లేరు వన్యప్రాణి అభ్యయారణ్యంగా ప్రకటించక ముందు కొల్లేరు గ్రామాల్లోని అంతర్గత రోడ్లు, గ్రామాలను కలిపే లింక్ రోడ్లు, ప్రస్తుతం వాటి నిర్వహణ, కొత్తగా నిర్మించిన, నిర్మించే రోడ్లపై, కొల్లేరు అభయారణ్య పరిధిలో రోడ్ల నిర్మాణం, రోడ్ల నిర్వహణలపై ఉన్న సమస్యలపై నివేదిక అందించాలని పంచాయతీ రాజ్ ఎస్ఈ రమణమూర్తిని కమిటీ సభ్యులు ఆదేశించారు. అనంతరం ఏలూరులో పారిశుద్ధ్య వ్యర్థాలు, వ్యర్థాల శుద్ధీకరణ సామర్థ్యం, కొల్లేరులో కలిసే ఏలూరు నగరంలోని పారిశుద్ధ్య వ్యర్థాలు వివరాలపై నివేదిక సమర్పించాలని నగరపాలక సంస్థ కమిషనర్‌ను ఆదేశించారు. కొల్లేరు పరిధిలో పర్యావరణం, కాలుష్య పరిస్థితులు, చేపల పెంపకానికి వినియోగించే నీరు, తాగునీటి కాలుష్యం, పరిశ్రమల ద్వారా కొల్లేరులోకి వెళ్లే వ్యర్థాల కారణంగా కాలుష్యం తదితర వివరాలపై సవివరమైన నివేదిక సమర్పించాలని కాలుష్య నియంత్రణ మండలి ఈఈ వెంకటేశ్వరరావును ఆదేశించారు. కొల్లేరులో చేపల పెంపకం, కాలుష్య నీటిలో ఉత్పత్తియ్యే చేపల వినియోగం కారణంగా అనారోగ్య సమస్యలు, చేపల పెంపకానికి వినియోగించే రసాయనిక ఎరువులు, పురుగు మందుల వివరాలు, వాటి కారణంగా కొల్లేరులో కలిగే కాలుష్యం తదితర విషయాలపై నివేదిక సమర్పించాలని మత్స్యశాఖ అధికారులను సూచించారు.

న్యూస్‌రీల్

వైఎస్ జగన్‌తో చినమిల్లి భేటీ



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న వెంకట్రాయుడు

భీమవరం: తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని భీమవరం నియోజకవర్గ సమన్వయకర్త చినమిల్లి వెంకట్రాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. తనను సమన్వయకర్తగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి భీమవరం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, నరసాపురం పార్లమెంట్ ఇన్‌చార్జ్ గూడూరి ఉమాబాల, పార్టీ మహిళా జిల్లా అధ్యక్షురాలు కోడే విజయలక్ష్మి, ఎంపీపీ పేరిచర్ల విజయనర్సింహరాజు, పార్టీ నాయకులు మేడిద జాన్సన్, ఏఎస్ రాజు, కామన నాగేశ్వరరావు, గాదిరాజు రామరాజు, చవాకుల సత్యనారాయణ, కోడె యుగంధర్, జిల్లా కొండయ్య తదితరులున్నారు.

చెవిరెడ్డి అరెస్టు అన్యాయం

భీమవరం: వైఎస్సార్‌సీపీ నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి అరెస్టు అక్రమమని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నాడు వెంకటరమణ అన్నారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. భాస్కరరెడ్డి రాజకీయాల పట్ల నిబద్ధత, నిజాయితీ గల నాయకుడని,, కూటమి ప్రభుత్వం జైలుకు పంపాలనే దుర్బుద్ధితో మద్యం అక్రమ కేసులో ఇరికించి వేధింపులకు పాల్పడేందుకు అరెస్టు చేశారన్నారు. భాస్కరరెడ్డి కుమారుడు మోహిత్‌రెడ్డితో పాటు మరో నలుగురుపై కేసు నమోదు చేయడం దురదృష్టకరమన్నారు.

వ్యవసాయంలో సాంకేతికత వినియోగించాలి



రైతులకు వ్యవసాయ పరికరాల సబ్సిడీ చెక్కును అందచేస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం: వ్యవసాయంలో సాంకేతికతను వినియోగించి అధిక లాభాలు పొందాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి రైతులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన యంత్ర పరికరాలు, రాయితీ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆహార కొరత స్థాయి నుంచి రైతులు విప్లవాత్మకమైన సాగు ద్వారా ధాన్యం విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి చేరుకున్నారన్నారు. జిల్లాకు కిసాన్ డ్రోన్ గ్రూపులకు 80 శాతం సబ్సిడీతో 41 డ్రోన్లను కేటాయించినట్లు చెప్పారు. సన్న, చిన్నకారు రైతులకు రూ.8.99 కోట్ల విలువైన వ్యక్తిగత యంత్ర పరికరాలకు రూ.3.84 కోట్లు రాయితీపై పంపిణీ చేశామన్నారు.

డీఎస్సీకి 1,161 మంది హాజరు

భీమవరం: జిల్లా వ్యాప్తంగా అయిదు పరీక్షా కేంద్రాల్లో బుధవారం నిర్వహించిన మెగా డీఎస్సీ పరీక్షకు 1,161 మంది హాజరైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఇ.నారాయణ చెప్పారు. ఉదయం పరీక్షకు 580 మందికి 567 మంది హాజరుకాగా.. మధ్యాహ్నం పరీక్షకు 601 మందికి 594 మంది హాజరయ్యారన్నారు.

సమగ్రశిక్ష సిబ్బంది బదిలీలకు అవకాశం

భీమవరం: జిల్లాలోని సమగ్ర శిక్ష ప్రాజెక్టులోని కాంట్రాక్ట్ సిబ్బంది బదిలీలకు ఈనెల 21లోగా దరఖాస్తు చేసుకోవాలని సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పి.శ్యామ్‌సుందర్ తెలిపారు. సమగ్రశిక్ష ప్రాజెక్టులో కాంట్రాక్ట్ సిబ్బందిగా పనిచేస్తున్న ఐఈఆర్‌పీ, పీటీఐ, సీఆర్ఎంటీ, మండల స్థాయి అకౌంటెంట్, సైట్ ఇంజనీర్స్, ఎంఐఎస్ కోఆర్డినేటర్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్స్, మెసెంజర్స్, ఆఫీసు సబార్డినేట్స్ తదితర సిబ్బంది రిక్వెస్ట్, సరస్పర ప్రతిపాదనల దరఖాస్తులను ఈనెల 19 నుంచి 21 లోగా సమగ్రశిక్ష ప్రాజెక్ట్ కార్యాలయంలో అందజేయాలని శ్యామ్‌సుందర్ తెలిపారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

భీమవరం (ప్రకాశంచౌక్): యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండేలా పెద్ద ఎత్తున ప్రచారం కల్పించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ వశిష్ఠ సమావేశ మందిరంలో వివిధ ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 'నషా ముక్త్ భారత్ అభియాన్' క్యాంపెయిన్ కార్యకలాపాలపై కలెక్టర్ సంబంధిత కమిటీ సభ్యులతో సమీక్షించారు.

బాబు మోసాన్ని ప్రజలు గమనిస్తున్నారు



జగన్ అంటే నమ్మకం–బాబు అంటే మోసం పుస్తకం ఆవిష్కరించిన మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: హామీలను నెరవేర్చిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డిపై ప్రజలు నమ్మకంతో ఉన్నారని, 143 హామీలిచ్చి ఒక్కటి కూడా నూరుశాతం అమలు చేయలేని చంద్రబాబు మోసాన్ని ప్రజలు గమనిస్తున్నారని మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో జగన్ అంటే నమ్మకం, చంద్రబాబు అంటే మోసం పుస్తకావిష్కరణ కార్యక్రమంలో బుధవారం మాజీ మంత్రి కొట్టు పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే చేసిన అప్పు రూ.1.50 లక్షల కోట్లని, ఏం చేశాడో లెక్కలు లేవన్నారు. అన్యాయం జరిగితే ప్రశ్నిస్తానన్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎక్కడా నోరు మెదపడంలేదన్నారు. ప్రజలు ప్రశ్నిస్తారనే భయంతో కూటమి ప్రభుత్వం రోజుకో డైవర్షన్ పాలిటిక్స్‌తో ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందని అన్నారు. పచ్చమీడియా బాబు మాదిరి ప్రజలను మోసం చేస్తోందని వ్యాఖ్యానించారు. సూపర్ సిక్స్ హామీల్లో స్త్రీ శక్తి, ఉచిత బస్సు, నిరుద్యోగ భృతి, కొత్త పింఛన్లు ఇంతవరకూ అమలు చేయకపోవడం చంద్రబాబు చేతకాని పాలనకు నిదర్శనమన్నారు. నారా లోకేష్ రెడ్ బుక్ పాలన పేరుతో రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్‌ను నిద్రావస్థలోకి పంపించాడన్నారు. మహిళలపై అఘాయిత్యాలు జరుగుతుంటే సాక్షాత్తు మహిళా హోం మంత్రి మాట్లాడకపోవడం దారుణమన్నారు. అనధికార బార్‌లు, దాబాలు, కోడి పందేలు, మహిళలపై లైంగిక దాడులతో నియోజకవర్గం రాష్ట్రంతో పోటీపడుతుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే తప్పులు చేసిన వారికే వత్తాసు పలుకుతూ బాధితులకు వ్యతిరేకంగా పోలీస్ స్టేషన్‌కు సిఫార్సులు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కొలుకులూరి ధర్మరాజు, కర్రి భాస్కరరావు, కైగాల శ్రీనివాసు, గుండుమోగుల సాంబయ్య, వీరయ్య, కంటమని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కరువు

వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మి



భీమవరంలో మాట్లాడుతున్న విజయలక్ష్మి

భీమవరం: రాష్ట్రం కూటమి ప్రభుత్వ పాలనలో మహిళలకు రక్షణ లేదని, మహిళలపై దాడులు పెచ్చుమీరిపోయాయని వైఎస్సార్‌సీపీ మహిళ జిల్లా అధ్యక్షురాలు కోడే విజయలక్ష్మి ఆవేదన వ్యక్తంచేశారు. బుధవారం భీమవరంలో విలేకర్ల సమావేశంలో కూటమి ప్రభుత్వంపై మండిపడ్డారు. వృద్ధులు, చిన్నారులని చూడకూండా మానవ మృగాలు ప్రభుత్వ అండతో రెచ్చిపోతున్నారని వారిని అదుపుచేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్తలు మహిళను చెట్టుకు కట్టి చిత్రహింసలకు గురి చేశారన్నారు. రాష్ట్రంలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలనలో విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి అమ్మ ఒడి పథకాన్ని ఎంతో పటిష్టంగా అమలుచేస్తే నేటి కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పేరుతో అనర్హులంటూ లక్షలాది మందికి మొండిచేయి చూపిందని, తండ్రికి మాత్రం విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు చేయిస్తున్నారని చెప్పారు. హామీలు అమలుచేయలేక అంకెల గారడీతో ప్రజల మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ప్రజలు తగిన సమయంలో గట్టిగా బుద్ధిచెబుతారని విజయలక్ష్మి హెచ్చరించారు.

వితన ఎంపికే కీలకం

- సార్వా వరి సాగు ప్రారంభం
- ఉమ్మడి పశ్చిమగోదావరిలో 5.60 లక్షల ఎకరాల్లో సాగు



భీమవరం: వ్యవసాయమే జీవనాధారమైన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సార్వా వరి సాగుకు రైతన్నలు సన్నద్ధమవుతున్నారు. ఏడాది కాలంగా రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించకపోవడం, గత దాళ్వా సీజన్ ధాన్యం సొమ్ములు ఇంకా చెల్లించపోవడంతో వరిసాగుకు రైతులు మీనవేషాలు లెక్కించాల్సిన పరిస్థితి.. ధాన్యం విక్రయించిన 24 గంటల లోపు సొమ్ములు రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమచేస్తున్నామని గొప్పగా ప్రచారం చేసుకున్న ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు ఒక్క పశ్చిమగోదావరి జిల్లాలోనే దాదాపు రూ.290 కోట్లు బకాయిపడినా నోరుమెదపపోవడం పట్ల రైతన్నలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ సాయం అందకున్నా, సకాలంలో ధాన్యం డబ్బులు చెల్లించపోయినా వరి సాగు తప్పనిసరికావడంతో సార్వా సాగుకు విత్తనాల సేకరణ, భూములు దుక్కులు వంటి పనుల్లో నిమగ్నమయ్యారు. సార్వా పంటకు అనువైన విత్తనాలు వేసుకోవడం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయశాఖాధికారులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు 5.60 లక్షల ఎకరాల్లో వరిసాగు చేస్తున్నందున విత్తన ఎంపిక కీలకం..

చీడ పీడలు తట్టుకునే రకాలు ఎంచుకోవాలి



వరిసాగులో రైతులు విత్తన ఎంపికలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వాతావరణం, భూసార పరిస్థితులకు అనువైన విత్తనాలను ఎంపిక చేసుకోవడం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చు. చీడ, పీడలను తట్టుకునే వరిరకాలను ఎంపిక చేసుకోవడం ద్వారా పెట్టుబడులు తగ్గించుకోవచ్చు.

– ఎంవీ కృష్ణాజీ, ప్రధానశాస్త్రవేత్త, వ్యవసాయ పరిశోధనాస్థానం, మార్టేరు

ఏ రకాలు ఉత్తమం..

- **ఎంటీయూ–1318 :** తక్కువ నత్రజనితో అధిక దిగుబడినిచ్చే పడిపోని రకం. పంటకాలం 150 రోజులు. రెండు వారాల నిద్రావస్థ కలిగి గింజ మొలకెత్తదు. సన్నగింజ రకం, కాండం దృఢంగా ఉండడంతో చేను నేలవాలే అవకాశం లేదు. అగ్గి తెగులు, మెడ విరుపు, పొట్టకుళ్లు తెగుళ్లను కొంతవరకు తట్టుకుంటుంది.
- **స్వర్ణ (ఎంటీయూ–7029):** తక్కువ నత్రజనితో అధిక దిగుబడినిచ్చే రకం. చౌడు భూముల్లో సాగుకు, ఎండాకు తెగులు ఆశించే ప్రాంతాలకు అత్యంత అనుకూలం, పంటకాలం 150 రోజులు. మూడు వారాల నిద్రావస్థ కలిగి గింజ మొలకెత్తదు.
- **ఇంద్ర(ఎంటీయు 1061):** చేను పడిపోదు. పిలక దశలో 10 రోజుల వరకు ముంపును తట్టుకుని అధిక దిగుబడినిచ్చే రకం. సన్న బియ్యం, మార్కెట్ రేటు ఎక్కువగా ఉంటుంది. పంటకాలం 150 రోజులు.
- **అమర (ఎంటీయూ 1064):** పిలక దశలో రెండు వారాల వరకు ముంపును తట్టుకుంటుంది. చేను పడిపోదు. దోమపోటు, ఎండాకు తెగుళ్లను తట్టుకుంటుంది. పంటకాలం 150 రోజులు
- **బాండవ మసూరి (పీఎల్ఏ–1100):** నీరు నిలువ ఉండే పల్లపు ప్రాంతాలకు, ముంపు ప్రాంతాలకు అత్యంత అనుకూలం. గింజ సన్నగా మసూరి రకాన్ని పోలి ఉంటుంది. పంటకాలం 160 రోజులు. నిద్రావస్థ లేకపోవడంతో కోత సమయంలో వర్షం వస్తే గింజ మొలకెత్తుతుంది.
- **ఎంటీయు–1232:** అధిక దిగుబడినిచ్చే ముంపును తట్టుకునే రకం. పంటకాలం 140 రోజులు, నారుమడి నుంచి పిలకలు కట్టే దశవరకు సుమారు 10 రోజుల పాటు ముంపును తట్టుకుంటుంది. దోమపోటు, అగ్గి తెగులు, మాగుడు తెగుళ్లను కొంతవరకు తట్టుకుంటుంది.
- **క్షీర (ఎంటీయు 1172):** పంటకాలం 150 రోజులు. ముంపు తట్టుకోవడంతోపాటు కొంతవరకు అగ్గి తెగులు, ఆకు ఎండు తెగుళ్లను తట్టుకునే రకం
- **భీమ (ఎంటీయు–1140):** పంట కాలం 145 రోజులు. ఎదిగే దశలో 10 రోజుల వరకు ముంపును తట్టుకుంటుంది. దోమపోటును తట్టుకునే రకం.
- **ఎంసీఎం–103 :** అధిక దిగుబడినిచ్చే చౌడును తట్టుకునే సనగింజ రకం. పంటకాలం 145 రోజులు. చౌడు ప్రాంతాలకు అత్యంత అనువైన వరి వంగడం. దోమపోటు, అగ్గి తెగుళ్లను కొంత వరకు తట్టుకుంటుంది. రెండు వారాల నిద్రావస్థ కలిగి గింజ మొలకెత్తదు.
- **శ్రావణి(ఎంటీయూ 1239):** సార్వాలో ఎంటీయూ 1318, స్వర్ణ, ఎంటీయూ 1064, ఎంటీయూ 1061, సంపద స్వర్ణ రకాలకు ప్రత్యామ్నాయంగా సాగుచేయదగ్గ తెలుపు గింజ రకం. 140 రోజుల పంటకాలం కలిగి కాండం దృఢంగా ఉండడంతో చేను పడిపోదు. రెండు వారాల నిద్రావస్థ ఉండడం వల్ల అధిక వర్షాల సమయంలో గింజ మొలకెత్తదు. దోమపోటు, ఎండాకు తెగుళ్లను తట్టుకుంటుంది.
- **సుజాత (ఎంటీయు–1210):** పంటకాలం సార్వాలో 135 రోజులు, దాళ్వాలో 125 రోజులు. రెండు వారాల నిద్రావస్థ కలిగి దోమపోటు, అగ్గి తెగుళ్లను తట్టుకుంటుంది. కాండం గట్టిగా ఉండడంతో చేను పడిపోదు. గింజ రాలిక తక్కువగా ఉంటుంది. వెదజల్లే విధానానికి కూడా అనుకూలంగా ఉంటుంది.
- **మారుటేరు సాంబ(ఎంటీయు–1224):** సన్న బియ్యం రకం. 140 రోజులు. దోమపోటును తట్టుకుంటుంది. బియ్యం పారదర్శకంగా ఉండి అన్నానికి బాగుంటుంది.
- **మారుటేరు మసూరి (ఎంటీయు–1262) :** సన్న బియ్యం. పంటకాలం 155 రోజులు. రెండు వారాల నిద్రావస్థ కలిగి ఎండాకు, దోమపోటును తట్టుకుంటుంది. కాండం దృఢంగా ఉండి చేను పడిపోదు. గింజ రాలిక తక్కువగా ఉంటుంది.

తల్లికి వందనం వర్తింపజేయాలి



వీరవాసరం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

వీరవాసరం: తల్లికి వందనం పథకాన్ని అంగన్‌వాడీలకు వర్తింపజేయాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ వీరవాసరం మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. సీఐటీయు జిల్లా నాయకుడు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ.. రూ.10,000 వేతనం దాటిందని, గవర్నమెంట్ ఉద్యోగి అని అంగన్‌వాడీలకు పథకాన్ని తిరస్కరించడం దారుణమని అన్నారు. గత ప్రభుత్వంలో అమ్మఒడి అంగన్‌వాడీలకు వర్తించిందని అన్నారు. అత్యధికమంది కేవలం వేతనం మీద ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. స్కీం వర్కర్లుగా, గౌరవ వేతనంతో బతికే అంగన్‌వాడీలకు అన్ని సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని అన్నారు. ఇంతవరకు అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదన్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే మరోసారి అంగన్‌వాడీలు రోడ్డు మీదకు రావడం తప్పదని అన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.68 కోట్లు



శ్రీవారి ఆలయంలో హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకా తిరుమల చినవెంకన్న ఆలయ హుండీల నగదు లెక్కింపు స్థానిక ప్రమోద కల్యాణ మండపంలో బుధవారం అత్యంత కట్టుదిట్టమైన భద్రతల నడుమ జరిగింది. ఈ లెక్కింపులో శ్రీవారికి భారీగా ఆదాయం సమకూరింది. గత 28 రోజులకు నగదు రూపేణా స్వామివాకి రూ. 3,68,88,156 ఆదాయం లభించినట్టు ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యనారాయణ మూర్తి తెలిపారు. కానుకల రూపేణా భక్తులు సమర్పించిన 317 గ్రాముల బంగారం, 7.877 కేజీల వెండితో పాటు, అధికంగా విదేశీ కరెన్సీ లభించిందన్నారు. అదేవిధంగా లెక్కింపులోకి రాని రద్దయిన పాత రూ.2000, రూ.1,000, రూ.500 నోట్ల ద్వారా రూ. 49 వేలు లభించినట్టు చెప్పారు.

క్లుప్తంగా

వాహన తనిఖీలపై స్పెషల్ డ్రైవ్



వాహన తనిఖీలు చేస్తున్న అధికారులు

భీమవరం (ప్రకాశంచౌక్) : కలెక్టర్, జిల్లా రోడ్ సేఫ్టీ కమిటీ చైర్‌పర్సన్ ఆదేశాల మేరకు రోడ్ సేఫ్టీ డ్రైవ్‌లో భాగంగా బుధవారం జిల్లా వ్యాప్తంగా వాహన తనిఖీలు నిర్వహించారు. హెల్మెట్లు ధరించని వారిపై 32 కేసులు, సెల్ ఫోన్ డ్రైవింగ్ 30 కేసులు, సీట్‌బెల్ట్ లేదని 28, ట్రిపుల్ రైడింగ్ 8, మోటార్ కార్‌కి ఫిలిం కలిగిన వాహనంపై 1 కేసు, నంబర్ ప్లేట్ లేదని 2, ఇన్సూరెన్సు లేనివి 3 కేసులు, డ్రైవింగ్ లైసెన్సులు లేని వారిపై 11 కేసులు నమోదు చేసి రూ.2,46,800 అపరాధ రుసుము విధించారు. వాహన తనిఖీల్లో జిల్లా వ్యాప్తంగా 10 మంది అధికారులు పాల్గొన్నారు.

డిజిటల్ అసిస్టెంట్ సస్పెన్షన్

పాలకోడేరు: పాలకోడేరు సచివాలయం -1 కి చెందిన డిజిటల్ అసిస్టెంట్ రవి నవనీత్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీకి సంబంధించిన రూ.75,994 ప్రభుత్వ ఖజానాకు జమ చేయకుండా నవనీత్‌కుమార్ తన అవసరానికి వాడుకున్నట్లు నిరూపణ కావడంతో కలెక్టర్ చదలవాడ నాగరాణి ఉల్లంఘన చట్టం అండర్ ఏపీసీఎస్ (సీసీ అండ్ ఎ) రూల్స్ 1991 ప్రకారం సస్పెన్షన్ ఆర్డర్ ఇచ్చినట్లు ఎంపీడీవో వి.రెడ్డియ్య తెలిపారు. తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు సంబంధిత ఉద్యోగి సస్పెన్షన్‌లోనే ఉంటాడని ఒక ప్రకటనలో తెలియజేశారు.

పెళ్లి వేడుకలో ఘర్షణ.. వ్యక్తి మృతి



జవదాల విజయశేఖర్ మృతదేహం

నరసాపురం రూరల్: పెళ్లి వేడుకల్లో ఏర్పడిన ఘర్షణలో ఒక వ్యక్తి మృతి చెందాడు. నరసాపురం రూరల్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 16వ తేదీ రాత్రి మండలంలోని కొత్తనవరసపురం గ్రామంలో జరిగిన ఈద వారి వివాహ వేడుక జరిగింది. ఈ వేడుకకు వచ్చిన బంధువుల్లో మద్యం మత్తులో జవదాల విజయశేఖర్ (46)తో అదే గ్రామానికి చెందిన ఈద సునీల్ ఆనంద్, అతని తండ్రి మోహనరావు (పండు) మరికొంత మంది గొడవ పడ్డారు. దీంతో పెద్దలు వారికి సర్దిచెప్పి పంపించారు. కాసేపటికే మళ్లీ సునీల్ ఆనంద్, మరికొందరు వచ్చి విజయశేఖర్‌ను పొడిచి, తలపై బలంగా కొట్టడంతో అతను కోమాలోకి వెళ్లిపోయాడు. కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మంగళవారం అర్ధరాత్రి విజయశేఖర్ మృతి చెందాడు. మృతుని భార్య జవదాల గీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

వామ్మో పిడుగులు.. తస్మాత్ జాగ్రత్త

- వానా కాలంలో పొంచి ఉన్న ముప్పు
- అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ



బుట్టాయగూడెం: వర్షాకాలం వచ్చిందంటే ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తూ ఉంటాయి. పిడుగులు కూడా పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. పిడుగు ఎప్పుడు పడుతుందో.. ఎలా పడుతుందో తెలియని పరిస్థితిలో ప్రమాదాలు వాటిల్లి ఒక్కోసారి ప్రాణనష్టం కూడా సంభవిస్తుంది. అదేవిధంగా మెరుపుల దాటికి గృహోపకరణాలు కూడా కాలిపోతూ ఉంటాయి. పిడుగులోని కాంతిప్రభావంతో నష్టం భారీగానే కలుగుతుంది. ఈ పరిస్థితుల్లో పిడుగు నుంచి రక్షించుకునేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తులశాఖ ఎప్పటికప్పుడు మెసేజ్‌ల రూపంలో హెచ్చరికలు జారీ చేస్తూనే ఉంది. జాగ్రత్తలు తీసుకోవడం ద్వారానే ప్రమాదాలను నివారించవచ్చని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు.

పిడుగు అంటే

వాతావరణంలో చోటుచేసుకున్న పరిణామాలతో ఒక్కసారిగా ఆకాశమంతా మేఘావృతమై మెరుపు వేగంతో విద్యుత్ కాంతి తీగరూపంలో నేలకు చేరుకుంటుంది. ఒక్కసారిగా విద్యుదావేశం పెరిగి మేఘాల సమీపంలో వ్యతిరేక విద్యుదావేశం ఉన్నప్పుడు వాతావరణంలోని తేమ, దుమ్ము కారణంగా వాటిలోని స్థిర విద్యుత్ భూమివైపు ప్రవహిస్తుంది. ఒక మిల్లీ సెకన్ కాలంలో మెరుపుతో కూడిన పిడుగు 20 వేల ఆంపియర్ల విద్యుత్ ప్రవాహాన్ని విడుదల చేస్తుంది. అప్పుడు ఏర్పడే విద్యుత్ క్షేత్ర తీవ్రత మీటరుకు 2 లక్షల ఓల్టులతో సమానం. ఇది భూమి నుంచి 1 నుంచి 2 కిలోమీటర్ల పొడవు ఉంటుంది. 2 మేఘాల మధ్య అయితే 7 కిలోమీటర్ల నుంచి 140 కిలోమీటర్ల దూరంలో ఉంటాయి. మెరుపులు భూమి మీద పడినప్పుడు వస్తువులను బట్టి నష్టతీవ్రత ఉంటుంది.

కాపర్ ఎర్త్ ఏర్పాటుతో ప్రమాదానికి చెక్

పిడుగు పాటు నుంచి తప్పించుకునేందుకు ఎత్తయిన ప్రదేశం నుంచి నేరుగా భూమిలోకి కాపర్ ఎర్త్ (రాగి వైర్‌ను అనుసంధానం చేస్తూ భూమిలోకి పాతాలి) ఏర్పాటు చేయడం ద్వారా దాదాపు కిలోమీటరు దూరంలో పడిన పిడుగును నేరుగా భూమిలోకి ఇదే ఆకర్షించుకుంటుంది. ఎర్త్ వైర్‌ను ఉప్పు, కర్రబొగ్గు, నీటి మిశ్రమాలతో రాగి వైరు కలిగిన రాడ్‌ను భూమిలోపలికి ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదాలకు చెక్‌పెట్టే అవకాశం ఉంటుంది. ఎత్తయిన టవర్‌లు ఏర్పాటు చేసేటప్పుడు పలు జాగ్రత్తలు పాటించడంతో పిడుగుపాటు నుంచి తప్పించుకునే అవకాశం ఉంది.

పాటించాల్సిన జాగ్రత్తలు

- వర్షం వచ్చేటప్పుడు చెట్ల కింద ఉండరాదు. ముఖ్యంగా ఎత్తయిన చెట్టు కింద అస్సలు ఉండకూడదు.
- ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం వస్తే రైతులు పొలాల వద్ద బహిరంగ ప్రదేశాల్లో ఉండకూడదు.
- లక్షల డిగ్రీల ఉష్ణోగ్రతతో విడుదలయ్యే వేడి ఒక్కసారిగా మనిషిని చేరగానే గుండెపై ప్రభావం చూపుతుంది.
- వర్షపు సూచన ఉన్నప్పుడు గొడుగులపై ఇనుప బోల్టులు, కెమేరాలు, సెల్‌ఫోన్‌లు దగ్గర లేకుండా చూసుకోవాలి. లేకుంటే రేడియేషన్ తరంగాలకు గురై ప్రమాదం జరిగే అవకాశం ఉంది.
- మెరుపులు, పిడుగుల వల్ల విద్యుత్ ఉపకరణాలు కాలిపోయే అవకాశం ఉంది. ఆ సమయంలో టీవీలకు ఉన్న విద్యుత్ కేబుల్ కనెక్షన్ తొలగించాలి.
- వర్షం పడుతున్న సమయంలో విద్యుత్ తీగల కింద ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో ఉండకూడదు. తడి ప్రదేశాల్లో ఉండకపోవడం చాలా మంచిది.

కరెంటు బిల్లు సాకుతో తల్లికి ఎగనామం



తన ఇద్దరు పిల్లలతో చౌటూరి కోటమ్మ

కామవరపుకోట కొత్తూరు యానాదుల కాలనీకి చెందిన చౌటూరి కోటమ్మ , భర్త సురేష్ గ్రామంలో కూలి పనులు చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. తమ పిల్లలు దుర్గాప్రసాద్ ఏడవ తరగతి, దీప్తి 3వ తరగతి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. వీరికి తల్లికి వందనం సొమ్ములు జమకాలేదు. దీంతో స్థానిక సచివాలయానికి వెళ్లి అడిగితే 300 యూనిట్లు పైబడి కరెంటు వాడారని.. అందుకే తల్లికి వందనం డబ్బులు పడలేదని సిబ్బంది తేల్చిచెప్పారు. దీంతో ఆ తల్లి లబోదిబోమంది. మాది రెండు గదులు గల చిన్న ఇల్లని, ఇంటా బయట ఎల్‌ఈడీ బల్బులు రెండు వాడతామని దానికి 300 యూనిట్ల బిల్లు ఎలా వస్తుందని ఆమె వాపోయింది. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వేడుకుంటుంది.

– కామవరపుకోట

ద్వారకాతిరుమలలో అదుపు తప్పిన కారు

ముగ్గురికి తీవ్ర, ఒకరికి స్వల్ప గాయాలు



చెట్లను ఢీకొని నుజ్జయిన కారు, ఇన్‌సెట్‌లో తీవ్ర గాయాలతో క్షతగాత్రుడు

ద్వారకాతిరుమల : శ్రీవారి దర్శనార్థం క్షేత్రానికి నలుగురు యువకులతో వెళుతున్న కారు అతివేగం , నిర్లక్ష్యం కారణంగా అదుపుతప్పి రోడ్డు మార్జిన్‌లోని చెట్లలోకి దూసుకెళ్లి, పక్కనే ఉన్న టైల్స్ షాపును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా, ఒకరు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ఘటన ద్వారకాతిరుమలలోని కుంకుళ్లమ్మ అమ్మవారి ఆలయం దాటిన తరువాత మలుపులో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. భీమవరంనకు చెందిన కె.విష్ణు తన అన్న కారును తీసుకుని, అదే పట్టణానికి చెందిన తన స్నేహితుడు మనోజ్‌తో కలసి ద్వారకా తిరుమల క్షేత్రానికి దైవదర్శనార్థం పయనమయ్యాడు. మార్గ మధ్యలో గణపవరం మండలం పిప్పరలో మరో ఇద్దరు స్నేహితులు బండారపు మోహన వెంకట సాయి, వడ్డీల ప్రభాకర్‌ను కారులో ఎక్కించుకున్నాడు. అతి వేగంగా వెళుతున్న కారు ఘటనా స్థలం వద్ద మలుపులోకి వచ్చేసరికి అదుపుతప్పి, రోడ్డు మార్జిన్‌లోని చెట్లలోకి దూసుకెళ్లి, పక్కనే ఉన్న టైల్స్ షాపుని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విష్ణు, మోహన్ వెంకట సాయి, ప్రభాకర్‌లకు తీవ్ర గాయాలు కాగా మనోజ్ మాత్రం స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. స్థానికులు హుటాహుటీన క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని ఎస్సై టి.సుధీర్ పరిశీలించారు.

పనికి వెళ్లినా.. నమోదు కాని హాజరు

- ఫీల్డ్ అసిస్టెంటును నిలదీసిన ఉపాధి కూలీలు
- తన అనుయాయులతో బెదిరింపులకు దిగిన ఫీల్డ్ అసిస్టెంట్
- భయభ్రాంతులతో మహిళ ఆత్మహత్యాయత్నం



నూజివీడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు చలపాటి రాణి

ముసునూరు: ఫీల్డ్ అసిస్టెంట్, అతని అనుయాయులతో బెదిరింపులకు పాల్పడడంతో ఓ ఉపాధి కూలీ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బాధితురాలు పేర్కొన్న వివరాల ప్రకారం ముసునూరుకు చెందిన చలపాటి రాణి, ఆమె భర్త తంబి ప్రతి రోజూ ఉపాధి హామీ పనులకు వెళుతున్నారు. కాని స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్ దేవరపల్లి రవితేజ గ్రామస్థాయి రాజకీయాల నేపథ్యంలో గత రెండు వారాలుగా వీరికి హాజరు వేయడం లేదు. దీంతో వారు ఫీల్డ్ అసిస్టెంట్‌ను హాజరు విషయంపై ప్రశ్నించారు. రెచ్చిపోయిన ఫీల్డ్ అసిస్టెంట్ రోజూ పనికి వచ్చినా మీకు హాజరు వేయనని తెగేసి చెప్పాడు. నిర్ఘాంతపోయిన బాధితులు ఈ విషయంపై న్యాయం కోరుతూ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. భయపడిన ఫీల్డ్ అసిస్టెంట్ గ్రామంలోని తన అనుయాయులు, పనిలో పాల్గొనకుండా హాజరు పొందుతున్న మరికొందరిని బాధితుల ఇంటి మీదకు ఉసిగొల్పాడు. దుక్కిపాటి విజయకుమార్, కొడవలి ఆంధ్రెయ, రాజేష్, సర్వేశ్వరరావు తదితరులు తంబి ఇంటి వద్ద లేని సమయంలో బాధితుల ఇంటికి వెళ్లి దుర్భాషలాడుతూ బెదిరింపులకు దిగారు. అంతటితో ఆగకుండా నీ భర్తను చంపేస్తామంటూ రాణిని బెదిరించారు. భయభ్రాంతురాలైన ఆమె తీవ్ర మనస్తాపానికి లోనై మంగళవారం నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికులు ఆమెను నూజివీడులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతోంది. తమను బెదిరిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్, అతని అనుయాయుల నుంచి ప్రాణరక్షణ కల్పించాలని బాధిత కుటుంబ సభ్యులు మొరపెట్టుకుంటున్నారు. దీనిపై తమకు సమాచారం అందలేదని ఎస్సై ఎం .చిరంజీవి చెప్పారు.

యువతిని మోసగించిన నేరంపై కేసు నమోదు

నూజివీడు: యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన యువకుడిపై నూజివీడు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ పీ సత్యశ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని నెప్రూలాపేటకు చెందిన కొర్రా సోనీ(25), ఎలికె సురేంద్రలకు ఇన్‌స్టాగామ్‌లో పరిచయం ఏర్పడగా అది కాస్తా ప్రేమగా మారింది. దీంతో వారిద్దరూ నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. 2023లో హైదరాబాద్ వెళ్లి అక్కడ ఒక విల్లాలో ఎంగేజ్‌మెంట్ అని చెప్పి రింగ్‌లు సైతం మార్చుకున్నారు. ఆ తరువాత నుంచి పెళ్లి గురించి అడిగితే సురేంద్ర మాట దాటేస్తున్నాడు. నాలుగు నెలల నుంచి సోనీ ఫోన్ నెంబరును బ్లాక్ లిస్టులో పెట్టాడు. దీంతో గట్టిగా నిలదీయగా తల్లిదండ్రులు ఒప్పుకోవడం లేదని, వివాహం చేసుకోలేనని చెప్పాడు. మనస్తాపానికి గురైన సోని ఈనెల 15న రాత్రి ఇంట్లో ఉన్న మందుబిళ్లలను ఎక్కువ మోతాదులో వేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు, బంధువులు హుటాహుటిన స్థానిక ఏరియా ఆసుపత్రికి ఆమెను తరలించి సకాలంలో వైద్యం చేయడంతో ప్రాణాపాయం తప్పింది. బాధితురాలు సోని ఫిర్యాదు మేరకు మంగళవారం అర్ధరాత్రి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కోకో గింజల దొంగలు దొరికారు

చోరీ సొత్తు 430 కిలోల కోకో గింజల స్వాధీనం



దొంగలు, స్వాధీనం చేసుకున్న కోకో గింజలతో డీఎస్పీ శ్రావణ్‌కుమార్, భీమడోలు సీఐ విల్సన్, ఎస్సై సుధీర్, సిబ్బంది

ఏలూరు టౌన్ : కోకో గింజల చోరీ కేసులో నలుగురు దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 430 కిలోల కోకో గింజలను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఏలూరు పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయంలో ఏలూరు డీఎస్పీ డీ.శ్రావణ్‌కుమార్ వివరాలు వెల్లడించారు. ద్వారకాతిరుమల మండలం వేంపాడు గ్రామంలో ఆలపాటి జగదీష్‌కుమార్ పొలంలో ఉన్న షెడ్డులోని 160 కిలోల కోకో గింజలను ఈనెల 15వ తేదీ రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ద్వారకాతిరుమల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి భీమడోలు సీఐ విల్సన్ ఆధ్వర్యంలో ఎస్సై సుధీర్ దర్యాప్తు చేపట్టారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో ఈనెల 17న సాయంత్రం అంగిడిగూడెం సంతమార్కెట్ సమీపంలో నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులు కామవరపుకోట మండలం తడికలపూడి గ్రామానికి చెందిన కొత్లపల్లి హర్ష, ద్వారకాతిరుమల మండలం వేంపాడు గ్రామానికి చెందిన గెద్దల నాగరాజు, ముదునూరి శివశంకర్, తడికలపూడి గ్రామానికి చెందిన జొన్నకూటి రాజేష్‌గా గుర్తించి వారిపై కేసు నమోదు చేశారు. నిందితులు జల్సాలు, వ్యసనాలకు బానిసలై డబ్బు సంపాదించేందుకు రాత్రివేళల్లో పొలాల్లోకి వెళ్లి కోకో గింజలను చోరీ చేస్తున్నట్లు విచారణలో అంగీకరించారు. వీరిపై దెందులూరు, తడికలపూడి, ద్వారకాతిరుమల పోలీస్‌స్టేషన్లలో పలు కేసులు నమోదయ్యాయి. నిందితుల నుంచి 430 కోకో గింజలను స్వాధీనం చేసుకోగా వాటి విలువ సుమారు రూ.2.15 లక్షలు ఉంటుందని పోలీసుల అంచనా. నేరానికి వినియోగించిన రెండు మోటారు సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చోరీ చేసిన కోకో గింజలను పెదవేగి మండలం చక్రాయగూడెం గ్రామానికి చెందిన సిరిబత్తుల ఉదయ్‌కుమార్ కొనుగోలు చేయడంతో అతడ్ని కూడా నిందితుడిగా పోలీసులు గుర్తించారు. ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ చూపిన సీఐ విల్సన్, ఎస్సై సుధీర్, హెచ్‌సీ ఎస్.శ్రీనివాస్, పీసీ ఎం.వెంకటేశ్వరరావు, సీహెచ్ లక్ష్మీనారాయణ, హెచ్‌జీ వీజే ప్రకాష్‌బాబును ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ అభినందించారు.

గుండెపోటుతో కూలీ మృతి



నిమ్మల రాంబాబు మృతదేహం

ఆకివీడు: గుండెపోటుతో ఓ కూలీ మృతి చెందాడు. ఈ ఘటన ఆకివీడు రైల్వేస్టేషన్ వద్ద బుధవారం చోటుచేసుకుంది. స్థానిక రైల్వే స్టేషన్ వద్ద బియ్యం బస్తాల వ్యాగన్లలో కూలీలు బియ్యం లోడు చేస్తున్నారు. వారికి మంచినీళ్లు అందిస్తున్న కూలీ దుంపగడకు చెందిన నిమ్మల రాంబాబు (54) ఆకస్మాత్తుగా సొమ్మసిల్లి పడిపోయాడు. తోటి కార్మికులు గమనించి అతడిని ఆసుపత్రికి తరలించే లోపు గుండెపోటుతో మృతి చెందాడు. రాంబాబుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. విధి నిర్వహణలో మృతి చెందిన రాంబాబు కుటుంబానికి ఎఫ్‌సీఐ గోడౌన్ యజమాన్యం ఆర్థిక సహాయం అందజేసే విధంగా సర్పంచ్ ముద్దే విశ్వేశ్వరరావు, మాజీ ఉపసర్పంచ్ కొట్టు ఆంజనేయులు తదితరులు బాధిత కుటుంబానికి బాసటగా నిలిచారు.

21 నుంచి పాలిసెట్ సర్టిఫికెట్ల పరిశీలన

తణుకు అర్బన్: డైరెక్టర్ అండ్ కన్వీనర్ పాలిసెట్ 2025 ఆదేశాల మేరకు పాలిసెట్‌కు అర్హత పొందిన విద్యార్థులకు తణుకు శ్రీ ముళ్లపూడి వెంకటరాయ మెమోరియల్ పాలిటెక్నిక్ కళాశాలలో హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ ఎస్.తులసిరాధ తెలిపారు. కౌన్సెలింగ్ ప్రక్రియ ఈనెల 21 నుంచి 28వ తేదీ వరకు కళాశాల ప్రాంగణంలో ధ్రువపత్రాల పరిశీలన, 25 నుంచి 30వ తేదీ వరకు ఐచ్ఛికాల ఎంపిక ప్రక్రియ జరుగుతుందని జూలై 3వ తేదీన సీట్ల కేటాయింపు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. జిల్లాలోని ఎస్టీ విద్యార్థులకు ధ్రువపత్రాల పరిశీలన తణుకు హెల్ప్‌లైన్ సెంటర్‌లో మాత్రమే నిర్వహించబడుతుందని వివరించారు. కౌన్సెలింగ్ షెడ్యూలు ప్రకారం 21న 1 నుంచి 15వేలు ర్యాంకు, 22న 15,001 నుంచి 32వేలు, 23న 32,001 నుంచి 50 వేలు, 24న 50,001 నుంచి 68 వేలు, 25న 68,001 నుంచి 86 వేలు, 26న 86,001 నుంచి 1,04,000, 27న 1,04,001 నుంచి 1,20,000, 28న 1,20,001 నుంచి చివరి ర్యాంకు వరకు ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందన్నారు. వెబ్ ఆప్షన్స్ కోసం 25, 26 తేదీల్లో 1 నుంచి 50 వేలు, 27, 28 తేదీల్లో 50,001 నుంచి 90వేలు, 29, 30 తేదీల్లో 90,001 నుంచి చివరి ర్యాంకు వరకు నిర్వహిస్తామని చెప్పారు. వివరాలకు 99123 42012, 94900 32025 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రివర్స్ చేస్తుండగా లారీ కింద పడి..

ఉంగుటూరు: రివర్స్ చేస్తుండగా లారీ కింద పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాల ప్రకారం చేబ్రోలు గ్రామ పంచాయతీ పరిధిలో తల్లాపురం రోడ్డును ఆనుకుని కొత్తగా వెంచర్ వేస్తున్నారు. ఆ వెంచర్‌లో మెరక పనులు చేస్తున్న నేపథ్యంలో లారీ రివర్స్ చేస్తుండగా లారీ కింద పడి అక్కడ పనిచేస్తున్న గాది గంటయ్య (55) అక్కడికక్కడే మృతి చెందాడు. గంటయ్యకు భార్య, వివాహం అయిన ఇద్దరు అమ్మాయిలు, అబ్బాయి ఉన్నారు. చేబ్రోలు ఎస్సై సూర్య భగవాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వాహన రాకపోకలకు దారి మళ్లింపు

నిడదవోలు : పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న ఆర్వోబీ పనుల నిమిత్తం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాజమండ్రి, కొవ్వూరు, నిడదవోలు, తాడేపల్లిగూడెం ప్రాంతాలకు రాకపోకలు సాగించే వాహనాలను గురువారం నుంచి దారి మళ్లించినట్లు తహసీల్దార్ నాగరాజునాయక్ బుధవారం తెలిపారు.

రాజమండ్రి నుంచి తాడేపల్లిగూడెం వైపు దారి మళ్లింపు ఇలా..

రాజమండ్రి నుంచి ఐ.పంగిడి, నల్లజర్ల, తాడేపల్లిగూడెం వైపునకు దారి మళ్లించారు. తాడేపల్లిగూడెం నుంచి రాజమండ్రి వెళ్లడానికి నల్లజర్ల, ఐ.పంగిడి, కొవ్వూరు మీదుగా రాజమండ్రి వెళ్లాల్సి ఉంది. మరో మార్గం ద్వారా రాజమండ్రి నుంచి కొవ్వూరు, విజ్జేశ్వరం, గోపవరం, డి.ముప్పవరం, కానూరు, తణుకు మీదుగా తాడేపల్లిగూడెం చేరుకోవచ్చు. తాడేపల్లిగూడెం నుంచి తణుకు, కానూరు, డి.ముప్పవరం, గోపవరం, విజ్జేశ్వరం, కొవ్వూరు మీదుగా రాజమండ్రి చేరుకోవచ్చు. నిడదవోలు నుంచి తాడేపల్లిగూడెం వెళ్లడానికి మరో మార్గంలో దారి మళ్లించారు. నిడదవోలు నుంచి కోరుమామిడి, అప్పారావుపేట, తాడేపల్లిగూడెం వైపునకు దారి మళ్లించారు. తాడేపల్లిగూడెం నుంచి అప్పారావుపేట, కోరుమామిడి, నిడదవోలు చేరుకోవచ్చునని తహసీల్దారు నాగరాజునాయక్ పేర్కొన్నారు.

బాలిక ఆత్మహత్యపై కేసు నమోదు



మోక్షశ్రీ (ఫైల్)

భీమడోలు : గుండుగొలనులో బాలిక ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. దీనిపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం గుండుగొలనుకు చెందిన చిట్టిబొమ్మల మోక్షశ్రీ 16) స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల పదో తరగతి పూర్తిచేసింది. 350 మార్కులతో ద్వితీయశ్రేణిలో ఉత్తీర్ణత సాధించింది. సెలవులకు అమ్మమ్మ ఇంటికి వెళ్లి వచ్చిన మోక్షశ్రీతో మంగళవారం తండ్రి పోతురాజు పాఠశాలకు వెళ్లాడు. అక్కడ నుంచి వచ్చిన తర్వాత కుమార్తె మోక్షశ్రీను మందలించాడు. టెన్త్‌లో సక్రమంగా చదువుకుంటే మంచి మార్కులు వచ్చేవని, ఇలాగే ఇంటర్‌లో కూడా చదివితే ఇబ్బందులు పడతావంటూ మందలించి బయటకు వెళ్లాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన మోక్షశ్రీ సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో వంట గదిలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. బాలిక మృతితో కుటుంబ సభ్యులు రోదనలు మిన్నంటాయి. సమాచారం అందుకున్న భీమడోలు సీఐ యూజే విల్సన్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై చలపతిరావు తెలిపారు.

బాలికపై అత్యాచారయత్నం

ఏలూరు టౌన్: ఏలూరు రూరల్ పరిధిలో ఓ మైనర్ బాలికపై అత్యాచారయత్నం జరిగింది. బాధిత బాలిక తల్లి సూరమ్మ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు రూరల్ పరిధిలో కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండగా.. మొండికోడు ప్రాంతంలో చిన్న ఇల్లు ఒక వ్యక్తి వద్ద కొనుగోలు చేశామని, అయితే అతని సోదరుడు ఇస్సాకు అనే వ్యక్తి బుధవారం తమ ఇంటికి వచ్చి తీవ్ర గందరగోళాన్ని సృష్టించాడని తెలిపింది. ఇల్లు తన సరిహద్దులో ఉందని, నాకే విక్రయించాలని, మీరు ఇల్లు ఏవిధంగా కొనుగోలు చేస్తారంటూ బెదిరింపులకు పాల్పడ్డాడని ఆరోపించింది. బుధవారం తమ కుమార్తె 14 ఏళ్ల బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడని తల్లి ఆవేదన వ్యక్తం చేసింది. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తీసుకు వచ్చామని తెలిపింది. మరోవైపు తమపై హత్యాయత్నానికి పాల్పడ్డారంటూ ఇస్సాకు ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇరు వర్గాల ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏలూరు రూరల్ ఎస్సై దుర్గాప్రసాద్ తెలిపారు.

ఉమ్మడి పశ్చిమ జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక

ఏలూరు రూరల్: త్వరలో జరగబోయే అంతర జిల్లాల సెంట్రల్ జోన్ క్రికెట్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా క్రికెట్ జట్లు ఎంపిక చేశామని అసోసియేషన్ త్రిసభ్య కమిటీ సభ్యులు ఆర్‌ఎస్‌ఆర్ మూర్తి, ఈ అశోక్‌కుమార్, ఎస్‌కే షేక్‌ఖాసిం బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

అండర్-16 జట్టు: కె పోనస్ నారాయణ (కెప్టెన్), కేవీఎస్ సుబ్బరాయుడు, జి జితేష్ సాయివల్లభన్, సీహెచ్ కార్తీక్‌రెడ్డి, ఆర్‌ఎస్‌వీడీ సుహాస్‌నాయుడు, సీహెచ్ ఎస్ శివకుమార్, సీహెచ్ జీఎస్ సాయిచరణ్ (వికెట్ కీపర్) ఏ శ్రీవత్సల్, పి బాలపరమేశ్వ రహేమ, పీ హేమంత్‌సాయి నరసింహగౌడ్, వివేక్‌జైన్, ఏ పార్థసారథి, వి గౌతమ్, వి సత్యకిరణ్, కేబీ అవినాష్‌తో పాటు స్టాండ్‌బైగా ఏ సురేష్, బి మేఘనాథ్, జి గౌతమ్‌రాజ్, టి కౌసిక్‌రాయుడు, బి పూర్ణేష్, ఎం శివసిద్దూ, బీకేఎస్‌ఎస్ శశిధర్ ఉన్నారు. ఈ జట్టు మంగళగిరిలో జూలై 3 నుంచి 13వ తేదీ వరకూ జరిగే పోటీల్లో పాల్గొంటుందన్నారు.

అండర్-19 జట్టు : కె ప్రణీత్‌పవన్ (కెప్టెన్), వీఎం వీఎస్ రక్షనస్ (వికెట్ కీపర్) పీ దీక్షిత్‌ఖాబు, సీహెచ్ వినయ్, ఓ రణదీప్, సీహెచ్ వైభవ్‌రాజ్, ఆర్ చంద్ర అనుషిక్, పీవీఎస్ రేవంత్‌వర్మ, కేపీఎస్ శ్రీరామ్, టి లలిత్‌పవన్, జె సాయిచరణ్‌రాజు, పి జహీర్‌ఖాన్, పి ఈనోస్‌తేజ, కె సాయికీర్తన్, డీఎస్‌వీఆర్ఎస్‌పీ మణిశంకర్‌తో పాటు స్టాండ్‌బైగా కె పోనస్ నారాయణ, జె శేయర్, కేవీఎస్ సుబ్బరాయుడు, వివేక్‌జైన్, బి నాగేంద్రబాబు, ఎం జశ్వంత్ ఉన్నారు. ఈ జట్టు ఈ నెల 21 నుంచి జూలై 1 వరకూ మంగళగిరిలో జరిగే పోటీల్లో పాల్గొంటుంది.

సీనియర్ మెన్ టి 20 జట్టు: బి మునీష్‌వర్మ (కెప్టెన్), జీఎస్ స్వామినాయుడు (వైస్ కెప్టెన్), కె రేవంత్‌నాగవర్మ, కేకేఎస్ఎన్ హరీష్, బి సాయికృష్ణకాంత్, ఎం హర్షవర్ధన్, వి జస్విన్, ఏ దినేష్, పి భువనేశ్వర్, బి చరణసాయితేజ, ఎండీ మెహబూబ్‌అలీ, ఈడీ విశ్వనాథ్, ఏ ప్రేమ్‌చంద్, జి రుత్విక్, జి దీపక్‌చంద్, కేఎస్‌ఎన్ రాజుతో పాటు స్టాండ్‌బైగా వీఎం వీఎస్ రక్షన్, కె జాన్‌రిచర్డ్స్, ఎన్ లక్ష్మన్‌కుమార్, టి ప్రభు, బి జయకృష్ణ ఉన్నారు. ఈ నెల 22 నుంచి 26 వరకూ మూలపాడులో జరిగే సెంట్రల్ జోన్ పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుందని వెల్లడించారు.

క్లుప్తంగా

గొర్రెలకు నీలి నాలుక వ్యాధి నివారణ టీకాలు



కొమ్ముగూడెం గ్రామంలో గొర్రెలకు నీటి నాలుక వ్యాధి నివారణ టీకాలు వేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కొమ్ముగూడెం గ్రామంలో గొర్రెలకు నీలి నాలుక వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. మండల పశువైద్యాధికారి విజయ్‌కుమార్ పర్యవేక్షణలో 48 గొర్రెలకు టీకాలు వేశారు. పశు సహాయకులు, పెంపకందారులు పాల్గొన్నారు.

'గూడెం' మండల వ్యవసాయాధికారిగా నారాయణ



తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం మండల వ్యవసాయాధికారి వి.నారాయణరావు నియమితులయ్యారు. బుధవారం స్థానిక తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఏవోగా పనిచేసిన ఆర్ఎస్ ప్రసాద్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో నారాయణ నియమితులయ్యారు. ఈయన పాలకోడేరు మండలం నుంచి బదిలీపై వచ్చారు.

డీఎస్సీ రాత పరీక్ష ప్రశాంతం



వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షకు హాజరైన విద్యార్థులు

తాడేపల్లిగూడెం: మెగా డీఎస్సీ పరీక్ష బుధవారం వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రశాంతంగా జరిగింది. 300 మంది విద్యార్థులకు గాను ఆరుగురు పరీక్షకు హాజరు కాలేదు. ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నాకర్‌రావు తదితరులు పర్యవేక్షించారు.

20న విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివే

తణుకు అర్బన్: తణుకు నియోజకవర్గ పరిధిలోని వివిధ సబ్‌స్టేషన్‌లలో మరమ్మతులు, నిర్వహణ నిమిత్తం ఈనెల 20వ తేదీన ఉదయం 7నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్‌శాఖ డివిజినల్ ఇంజనీ రు కె.నరసింహమూర్తి తెలిపారు. తణుకు పట్టణ పరిధిలో వేల్పూరు రోడ్డు, నరేంద్ర సెంటర్, రాష్ట్ర పతి రోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్డు, బ్యాంక్ కాలనీ, సజ్జా పురం, ఆర్‌కే మఠం ఏరియా, ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల, కొండాలమ్మ పుంత, మునిసిపల్ ఆఫీసు రోడ్డు, డిమార్ట్ ప్రాంతాల్లోను, తణుకు రూరల్ పరిధిలో పెదపాటి చెరువు, హౌసింగ్ కాలనీ, మండపా క, దువ్వ గ్రామాల ఇండస్ట్రియల్ సర్వీస్‌లు, అత్తిలి మండల పరిధిలో అత్తిలి, ఆరవల్లి, మంచిలి, ఈడూ రు గ్రా మాల్లోను, ఇరగవరం మండల పరిధిలోని ఇరగవరం, గోటేరు, గోపాలపురం, కేతావారిపాలెం, కాకుల ఇల్లింద్రపర్రు, యర్రాయిచెర్వు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని వినియోగదారులు సహకరించాలన్నారు.

జూలై 5న జాతీయ లోక్ అదాలత్

భీమవరం: భీమవరంలో జూలై 5న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు భీమవరం మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్, ఫోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి బి లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం భీమవరంలో న్యాయవాదులతో ఏర్పాటుచేసిన ప్రత్యేకంగా సమావేశంలో ఆయన మాట్లాడారు. మోటారు వెహికల్ ఇన్సూరెన్స్ కేసులు 220 పెండింగ్‌లో ఉన్నాయని ఇన్సూరెన్స్ కంపెనీలు ముందుకు వస్తే ఎక్కువ కేసులు పరిష్కారమవుతాయన్నారు. జాతీయ లోక్ అదాలత్ మంచి అవకాశమని, ప్రతి రోజూ ప్రీ లోక్ అదాలత్ సిట్టింగ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు న్యాయమూర్తి లక్ష్మీనారాయణ చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు నిమ్మల సత్యనారాయణ, నిమ్మల నవీన్, చక్రవర్తి, రమేష్ పాల్గొన్నారు.

భర్త ఇంటి ముందు భార్య ధర్నా

నరసాపురం రూరల్: మండలంలోని పాత నవరసాపురంలో తన భర్త, అత్త మామలు తనను వేధిస్తున్నారంటూ బుధవారం భర్త బర్రె శివశంకర్ ఇంటి ముందు భార్య దుర్గ భవాని ధర్నాకు దిగింది. తనది నరసాపురం మండలం పెదమైనవానిలంక గ్రామం అని నాలుగు నెలల క్రితం పాతనవరసపురం గ్రామానికి చెందిన వ్యక్తితో పెద్దల సమక్షంలో వివాహమైందని ఆమె పేర్కొన్నారు. అయితే కొన్ని రోజులుగా తనను ఇంట్లోకి రానియకుండా తాళం వేస్తూ బయట పడుకోబెడుతున్నారని ఆమె వాపోయింది. తనలో లోపాలు ఉన్నాయంటూ తన భర్తతో పాటు కుటుంబ సభ్యులు అవమానించి, తనను చంపేస్తామని బెదిరిస్తున్నారని బాధితురాలు వాపోయింది.

సమస్యల వలయంలో వీకర్స్‌కాలనీ

- క్షీణించిన పారిశుధ్యం
- కానరాని చర్యలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని వీకర్స్ కాలనీలో పారిశుధ్యం క్షీణించింది. ఇప్పటికే అడపాదడపా వర్షాలు ప్రారంభం కావడం, సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే కాలం కావడంతో పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వార్డులో అస్తవ్యస్తంగా డ్రెయినేజీలు, లో–లెవిల్‌లో డ్రెయినేజీలు, డ్రెయినేజీ కంటే దిగువులో రహదారులు, ఖాళీ స్థలాలలో తుప్పలు, ఇతర వ్యర్థాలు ఉన్నాయి. ముఖ్యంగా డ్రెయినేజీ వ్యవస్థను వ్యవస్థను ప్రక్షాళన చేయాలని, లో–లెవిల్‌లో ఉన్న రహదారులను అభివృద్ధి చేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని వార్డు ప్రజలు కోరుతున్నారు.

అస్తవ్యస్తంగా డ్రెయినేజీ వ్యవస్థ

వార్డులో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. వార్డు చుట్టూ ముఖ్యంగా గాయిత్రిగుడి నుంచి కల్కి కర్రీ పాయింట్‌వరకు ఉన్న ప్రధాన డ్రెయినేజీ వ్యవస్థ బురద, మట్టి, వ్యర్థాలతో పూడుకుపోయింది. భారీగా చెత్తతో నిండిపోయింది. దీంతో అంతర్గత డ్రెయిన్‌లు కంటే ప్రధాన డ్రెయిన్‌లో చెత్త ఎక్కువగా పెరిగిపోయింది. అంతర్గత డ్రెయిన్‌లు లో–లెవిల్‌కు చేరుకున్నాయి. అంతర్గత డ్రెయిన్‌లలో ఉన్న మురుగు నీరు ముందుకు సాగడం లేదు. మురుగు ప్రవహించకుండా ఎక్కడికక్కడే నిలిచిపోతుంది. 15ఏళ్లుగా ఇక్కడ ఇదే పరిస్థితి నెలకొనిఉందని చెబుతున్నారు. వార్డు చుట్టూ ఉన్న ప్రధాన డ్రెయినేజీతో పాటు అంతర్గత డ్రెయినేజీలో చెత్తను తీయాలని ప్రజలు కోరుతున్నారు. కమీషనర్‌గా శామ్యూల్ ఉన్న సమయంలో 2వ వార్డులో ప్రధాన డ్రెయినేజీలో చెత్తను తీయాలని శానిటరీ సిబ్బందికి, అసిస్టెంట్ కమీషనర్‌కు ఆదేశాలు ఇచ్చినా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు వాపోతున్నారు.



వార్డులో వ్యర్థాలు పేరుకున్న దృశ్యం



కోతిబొమ్మ సెంటర్‌కు వెళ్లే డ్రెయిన్‌లో వ్యర్థాలు



గాయత్రి గుడి సమీపంలో ఓ ప్రధాన డ్రెయిన్

ఖాళీ స్థలాలు

ఈ వార్డులో ఖాళీ స్థలాలు ఎక్కువగానే ఉన్నాయి. తుప్పలు, తూడుకర్రలు, పిచ్చిమొక్కలు, డ్రెయిన్ వ్యర్థాలు ఇలా పరిసరాలతో అస్తవ్యస్తంగా కాన వస్తున్నాయి. పాములు, దోమలు ఉత్పత్తి కేంద్రాలుగాను, పందులు బెడద ఎక్కువగా కాన వస్తుంది. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని నిత్యం చెబుతున్నప్పటికి అపరిశుభ్ర వాతావరణం అనేక ప్రాంతాలలో తాండవిస్తుంది. రహదారి మార్గాల అంచులలో పిచ్చిమొక్కలు బాగా పెరిగాయి.

ఇరుకు, పల్లం రహదారులు

ఈ వార్డులో ప్రధాన రహదారులు కంటే వార్డులోని అంతర్గత రహదారులు ఇరుకుగాను, పల్లంగా ఉన్నాయి. దీంతో వర్షకాలం వస్తే డ్రెయినేజీ వ్యవస్థ పొంగి, రహదారులు అన్ని మురుగు నీటితో కాలువ తరహాలో ప్రవహిస్తాయని, ప్రధాన డ్రెయిన్‌లు ముందుకు సాగితే తప్ప రోడ్డు మీద మురుగు నీరు కదలదని, రహదారులు పరిశుభ్రంగా ఉండవని చెబుతున్నారు. తక్షణమే వార్డులోని అస్తవ్యస్త పరిస్థితులను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రధాన డ్రెయినేజీలో చెత్తను తొలగించాలి



స్థానిక రెండో వార్డులోని గాయిత్రి గుడి సమీపం నుంచి కల్కి కర్రి పాయింట్ వరకు ఉన్న ప్రధాన డ్రెయినేజీలో చెత్త, వ్యర్థాలు బయిటకు తీయాలి. అంతర్గత డ్రెయినేజీలో మురుగు నీరు ప్రధాన డ్రెయిన్‌లోకి వెళ్లే విధంగా చూడాలి. వార్డులోని అస్తవ్యస్థ పరిస్థితులను తొలగించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి

– పి.రామకృష్ణంరాజు, 2వ వార్డు స్థానికుడు

మోడల్ స్కూల్స్‌ను వినియోగించుకోవాలి



బంగారుగూడెం గ్రామంలో చిన్నారులకు పుస్తకాలు, బ్యాగులు అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన మోడల్ స్కూల్స్ విధానాన్ని తల్లిదండ్రులు వినియోగించుకోవాలని మండల విద్యాశాఖ అధికారి వి.హనుమ అన్నారు. బుధవారం మండలంలోని బంగారుగూడెం మండల పరిషత్ మోడల్ ప్రాథమిక పాఠశాలలో అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో వి.హనుమ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఇటువంటి అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించడం వల్ల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల పట్ల ఆసక్తి పెరుగుతుందన్నారు. ఎస్ఎంసీ చైర్మన్ ప్రత్తిపాటి శ్రీను మాట్లాడుతూ బంగారుగూడం పాఠశాలలో విద్యార్థులు క్రమశిక్షణతో బాగా చదువుతారని, తల్లిదండ్రులు పిల్లల్ని పెద్ద సంఖ్యలో చేరుస్తున్నారన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కడవకొలను విజయలక్ష్మి మాట్లాడుతూ పాఠశాల పిల్లల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ పెంపొందించి విద్యార్థులందరికీ నాణ్యమైన విద్యను అందిస్తానన్నారు. అనంతరం విద్యార్థులకు బోధనాభ్యాస సామాగ్రిని అందజేశారు. బీజేవైఎం మండల అధ్యక్షుడు సమయమంతుల కాశి, జనసేన నాయకులు మట్టా రామకృష్ణ, పాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యోగా చేద్దాం.. ఆరోగ్యంగా ఉందాం



పట్టణంలో యోగా ఆసనాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని పలువురు వక్తలు తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జూన్ 21న శనివారం యోగా డేను నిర్వహించనున్నారు. ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీలో అంతర్జాతీయ యోగా డే ప్రకటించారు. అదే రోజు భారీగా సామూహిక యోగ సాధన చేసేందుకు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం, ఆయా రాష్ట్రాలు సంయుక్తంగా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మన రాష్ట్రంలో కూడా యోగా డేను నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా మే 21వ తేదీ నుంచి జూన్ 21వ తేదీ వరకు యోగా మాసోత్సవాలు జరిగాయి. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఎస్పీ ఆర్డీఓ తదితరుల పర్యవేక్షణలో అన్ని నగర పాలక సంస్థలలో యెగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. మునిసిపల్ కమీషనర్, ఎండీఓ, ఎంఆర్ఓ, వీఆర్ఓలు, వివిధ శాఖల అధికారులు ఆధ్వర్యంలో ప్రజలకు ప్రతిరోజు యోగా చేయిస్తు, ప్రోటోకాల్ యోగాలను ప్రాక్టీస్ చేయించారు. యోగా డే ప్రాముఖ్యతను వెల్లడిస్తున్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గ పరిధిలో అన్ని వార్డులలో యోగా గురువులు ఆరా ఫౌండేషన్ యోగ మాస్టర్ కరిబండి రామకృష్ణ, పతంజలి యోగాలయం యోగ గురువు వింజమూరి మాధవరావు, స్థానిక గుణ్ణం ఫంక్షన్ హాల్ ఆవరణలో శ్రీ సత్యసాయి ధ్యాన మండలి నిత్య యోగా సాధన కేంద్రం ఆధ్వర్యంలో యెగా టీచర్ బడుగు చంద్రశేఖర్‌లతో పాటు యోగా గురువులు సుభద్ర గుప్తా, సుజాత, అంబిక తదితరులు ఆధ్వర్యంలో ఆయా ప్రాంతాలలో చిన్నారులనుంచి బాల బాలికలు, యువతీ యువకులు, మహిళలు, పెద్దలు, వృద్ధులు యోగాసనాలు వేయించడం చేశారు. రోజు పాణాయమం, వివిధ ఆసనాలు, ధ్యానం , విశ్రాంతి వంటి వివిధ విభాగాలు అభ్యా సం చేయించారు. శిక్షణ కార్యక్రమాలు విశేషంగా జరిగాయి. రానున్న 21వ తేదీన భారీగా సామూహిక యోగా చేసేందుకు వివిధ ఏర్పాట్లు చేశారు.

విద్యా సామగ్రి పేరుతో దోచుకుంటున్నారు



ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యా సామగ్రి పేరుతో వ్యాపారం చేస్తున్నారని, విద్యార్థులు వారి తల్లిదండ్రులు దగ్గర నుంచి దోచుకుంటున్నారని, పుస్తకాలు అమ్మడాన్ని నిరసిస్తూ బుధవారం ఉదయం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కార్పొరేట్ పాఠశాల వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. ఎస్ఎఫ్ఐ నాయకులు ఆందోళనకు దిగారు. జిల్లా కార్యదర్శి టి.ప్రసాద్ మాట్లాడుతూ కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద నుంచి విద్యాసామగ్రి, యూనిఫామ్, పుస్తకాలు అంటూ దోచుకోవడం, తల్లిదండ్రులపై ఒత్తిడి తీసుకురావడం, అసలు ధర కన్నా, రెండు నుంచి మూడు రెట్లు అధికంగా అమ్ముతున్నారని, తల్లిదండ్రుల జేబులను గుల్ల చేస్తున్నారని మండిపడ్డారు. నాయకులు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఎ.నాగేశ్వరరావుకు ఫోన్ ద్వారా సమాచారం అందజేశారు. అయితే ఆయన జిల్లా కలెక్టర్ మీటింగ్‌లో ఉండటంతో తాడేపల్లిగూడెం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌ను పరిశీలించామని ఆదేశాలు ఇవ్వడంతో ఆమె ఆ కళాశాల వద్దకు చేరుకున్నారు. ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం అందజేశారు. అయితే సంబంధిత కళాశాల యాజమాన్యం స్పందించకపోవడంతో ఈ మేరకు షోకాజు నోటీసు ఇస్తానని జిల్లా అధికారి నాగేశ్వరరావు చెప్పడంతో ఎస్ఎఫ్ఐ నాయకులు ఆందోళన విరమించారు. విద్యాశాఖ అధికారులు ఇప్పటికైన ప్రైవేట్ పాఠశాలలో విస్తృత తనిఖీలు చేయాలని, చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బి.గణేష్, పట్టణ నాయకులు నాగేంద్రబాబు, టి.రవి బాబు, మణికంత, గణేష్, సింధు తదితరులు పాల్గొన్నారు.

యోగాను దినచర్యగా పాటించాలి



తణుకులో యోగ కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ లక్ష్మీసుందరీబాయ్

తణుకు అర్బన్: నిత్యజీవితంలో యోగాను దినచర్యగా పాటించి మంచి ఆరోగ్యాన్ని పొందాలని ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల ప్రిన్సిపల్ యు.లక్ష్మీసుందరీబాయ్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కళాశాల ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. యోగ ఆచరిస్తే మానసిక ఉల్లాసంతో పాటు ఆధ్యాత్మిక సాధన చేకూరుతుందని స్పష్టం చేశారు. యోగా ట్రైనర్ వి.హరిత మాట్లాడుతూ సకల అనారోగ్యాలకు యోగా అత్యుత్తమ మెడిసిన్‌గా పనిచేస్తుందని అన్నారు. ముఖ్యంగా శారీరక, మానసిక ఒత్తిడి నుంచి యోగా ద్వారా బయటపడగలమని అన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ క్యాడెట్స్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అంగన్‌వాడీ విభాగం ఉపాధ్యక్షురాలిగా చంద్రకళ



చంద్రకళను అభినందిస్తున్న గుడాల గోపి

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్ర వైఎస్సార్ సీపీ అంగన్వాడీ విభాగం ఉపాధ్యక్షురాలిగా పట్టణానికి చెందిన మద్దా చంద్రకళ నియమితులయ్యారు. పార్టీ సీనియర్ నాయకురాలిగా అనుభవం ఉన్న చంద్రకళకు రాష్ట్ర పదవి చేపట్టడం అభినందనీయమని బుధవారం పలువురు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇంచార్జ్ గుడాల శ్రీహరిగోపాలరావు మాట్లాడుతూ కష్టపడే వారికి పార్టీలో ఎప్పుడూ సముచిత స్థానం ఉంటుందని అన్నారు. అనంతరం పార్టీ కార్యాలయంలో చంద్రకళకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు యడ్ల తాతాజీ, యినకొండ రవి, కోరాడ శ్రీనివాసరావు, బండి రమేష్, రేలంగి శ్రీను, ఉండ్రాజవరపు రవి, శంకరావు శ్రీను, గుడాల సురేష్, పాలపర్తి కృపానాథ్, గంటా నరేష్, చెన్ను విజయ్, కెల్లా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలి



మాట్లాడుతున్న కోనాల భీమారావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. స్థానిక కపర్ధీ భవనంలో బుధవారం సీపీఐ పట్టణ సమితి సమావేశం జరిగింది. భీమారావు మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలన్నారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి కూడా ప్రభుత్వ సంక్షేమాలు అందజేయాలన్నారు. ప్రజలెదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 6, 7 తేదీలలో సీపీఐ 26వ జిల్లా మహాసభలు ఉండిలో నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లా మహాసభలు విజయవంతానికి కృషి చేయాలని కోరారు. అదే విధంగా జూలై 12వ తేదీన పట్టణ మహాసభలు జరుగుతాయని చెప్పారు. సీపీఐ నాయకులు కలిశెట్టి వెంకట్రావు, ఎం.సీతారాం ప్రసాద్, మండల నాగేశ్వరరావు, అల్లం రాము, దాస్యం రాము, ఎస్.నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భవిత సెంటర్‌లో ఫిజియోథెరపీ సేవలు



భవిత సెంటర్‌లో ఫిజియోథెరపీ చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని భవిత దివ్యాంగుల సెంటర్ శిక్షణ కేంద్రంలో బుధవారం డాక్టర్ అల్లు శ్రీకృష్ణ మహేష్‌చే దివ్యాంగుల పిల్లలకు ఫిజియోథెరపీ నిర్వహించారు. మహేష్ మాట్లాడుతూ కండరాలు బిగిసుకుపోవడం, మెడ నిలబెట్ట లేకపోవడం, కూర్చోలేకపోవడం, సరిగా నడవ లేని పరిస్థితి తదితర సమస్యలకు ప్రతి వారం బుధవారం ఫిజియోథెరపీ సేవలు అందజేస్తామని చెప్పారు. ప్రత్యేక ఉపాధ్యాయుడు ఎస్‌కే బాల ఈశ్వరయ్య మాట్లాడుతూ దివ్యాంగులకు అన్ని రకాల సదుపాయాలు అందిస్తున్నట్లు, సద్వినియోగం చేసుకోవాలన్నారు. నార్మల్ పిల్లలతో సమానంగా దివ్యాంగులను గౌరవించి ప్రోత్సహించాలని పలు సూచనలు చేశారు. ఆర్.కోటయ్య, బి.రాంబాబు, ఎం.చంద్రకుమారి, దివ్యాంగుల పిల్లలు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గ్రామ మహిళా సమాఖ్య భవనం నిరుపయోగం



నిరుపయోగంగా ఉన్న గ్రామ మహిళా సమాఖ్య భవనం

పెనుమంట్ర: మండల కేంద్రమైన పెనుమంట్రలో గ్రామ మహిళా సమాఖ్య భవనం నిరుపయోగంగా మారింది. ఈ భవనాన్ని గ్రామంలో మహిళా సంఘాలు కనీసం వినియోగించకపోవడంతో అక్కడ దుర్గంధ భరితంగా మారి, భవనం శిథిల దశకు చేరుకుంది. 2018లో ఎన్‌జీఎంఆర్ఎస్ నిధులు రూ.13 లక్షలు వెచ్చించి ఈ భవన నిర్మాణాన్ని చేపట్టి 2019 ఫిబ్రవరిలో అప్పటి కార్మిక శాఖ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ఈ భవనానికి ప్రారంభోత్సవం చేశారు. అప్పటి నుంచి ఒకటి, రెండు సార్లు ధాన్యం కొనుగోలు సమయాల్లో ఈభవనాన్ని వినియోగించారే తప్ప ఎప్పుడూ మహిళలు తమ సమావేశాల కోసం ఉపయోగించుకున్న దాఖలాలు కనబడలేదు. రాజీవ్ కాలనీలో ఐసీడీఎస్ కార్యాలయ భవనానికి పక్కనే స్టేట్‌హైవే రోడ్డుకు ఆనుకుని ఈ భవనం నిర్మించారు. మహిళా సమాఖ్య అవసరాల కోసం ఈభవనాన్ని వినియోగించుకోకుండా తమ సమావేశాలను ఎప్పుడూ సీఏలు తమ ఇళ్ల వద్దనే నిర్వహించడమే తప్ప తమకు ఒక భవనం ఉందనే సంగతి కూడా మర్చిపోవడంతో భవనం పరిసర ప్రాంతాలలో ఉన్న కొందరు భవన పరిసరాలను ఆక్రమించుకుని బట్టలు ఆరవేయడం తదితర తమ అవసరాలకు వినియోగించుకుంటున్నారు.

శిథిలావస్థలో వాతావరణ శాఖ కార్యాలయం

- స్థలం కోసం రెవెన్యూశాఖకు లేఖ
- 14 ఏళ్లుగా పెండింగ్‌లోనే ఫైల్

నరసాపురం: నరసాపురం భారత వాతావరణశాఖ కార్యాలయం భవనం శిథిలావస్థకు చేరింది. అరకొర సౌకర్యాల మధ్య ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా కీలకమైన వాతావరణ సమాచారం సేకరించే ఈ కేంద్రంలో వసతులు సరిగ్గా లేని కారణంగా, కచ్చితమైన సమాచారం సేకరించడానికి సాంకేతికంగా అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జిల్లా మొత్తానికి ఆటోమేటిక్ వెదర్ స్టేషన్ నరసాపురంలోనే ఉంది. తీరప్రాంతం కావడం, తరచూ తుఫాన్‌లు వంటి ప్రకృతి విపత్తులు రావడంతో ముందు ఆలోచనలతో భారత వాతావరణశాఖ ఇక్కడ కార్యాలయాన్ని నిర్మించింది. 1982లో ఇక్కడ వాతావరణ సమాచారం సేకరించేందుకు స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో భవనం నిర్మించారు. 1984లో స్థానికంగా వాతావరణశాఖ సేవలు ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి అదే భవనంలో వాతావరణశాఖ కార్యాలయం పని చేస్తుంది.

కచ్చిత సమాచారంకోసం తిప్పలు

వాతావరణశాఖ భవనం హౌసింగ్ డిపార్ట్‌మెంట్ కార్యాలయం పైన గదిలో కొనసాగుతుంది. భవనం శిథిలావస్థకు చేరింది. జిల్లాకు సంబంధించి ప్రధానమైన స్టేషన్. వర్షపాతం వివరాలతో పాటు, తుఫాన్‌ల తీవ్రత, ఉష్ణోగ్రతలు, గాలివేగం, గాలిలో తేమశాతం వంటి వివరాలు ఎప్పటి కప్పుడు నమోదు చేస్తారు. సమాచారాన్ని విశాఖపట్టణం, పూనె, హైదరాబాద్ వాతావరణశాఖ కార్యాలయాలకు చేరవేస్తారు. ఆటోమేటిక్ వెదర్ స్టేషన్ కూడా కార్యాలయం పక్కనే ఉంది. అయితే విలువైన ఈ పరికరాలు ఉన్న ప్రాంతం చుట్టూ చెట్లు పెరిగిపోయాయి. కార్యాలయం కూడా శిథిలావస్థలో ఉండటంతో కచ్చిత సమాచారాన్ని రాబట్టడానికి అధికారులు తిప్పలు పడాల్సి వస్తోంది.



అసౌకర్యాల మధ్య కొనసాగుతున్న నరసాపురం వాతావరణ శాఖ కార్యాలయం

పెండింగ్‌లో అభివృద్ధి ప్రతిపాదనలు

ఎకరం స్థలంలో అధునాతన స్టేషన్‌ను , సిబ్బందికి క్వార్టర్స్‌ను నిర్మించాలనే ప్రతిపాదన దాదాపు 14 సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉంది. ఎకరం స్థలం కోసం వాతావరణ శాఖ 2011లో అప్పటి ఉమ్మడి పశ్చిమ జిల్లా కలెక్టర్‌కు లేఖ రాసింది. అయితే రూరల్ ప్రాంతంలో స్థలం ఇస్తామన్నారు. అప్పటి నుంచి ఈ ప్రతిపాదన పెండింగ్‌లోనే ఉంది. ప్రస్తుతం కార్యాలయ భవనం ఉన్న పక్కనే సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఉన్న 15 సెంట్ల స్థలాన్ని ఇవ్వాలని మూడేళ్ల క్రితం వాతావరణశాఖ కోరింది. ఈ మేరకు సబ్ కలెక్టర్ ద్వారా జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారు. స్థలం మంజూరు చేస్తే క్వార్టర్స్‌ను మినహాయించి, అధునాతనంగా మూడంతస్తుల్లో వాతావరణశాఖ కార్యాలయ భవనాన్ని నిర్మిస్తామని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. కానీ ఈ ఫైల్ కూడా పెండింగ్‌లోనే ఉండడం గమనార్హం.



చుట్టూ చెట్ల మధ్య ఉన్న ఆటోమేటిక్ వెదర్ స్టేషన్

జిల్లాలో క్షయ వ్యాధి తగ్గుముఖం



ఆకివీడు సీహెచ్‌సీలో క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అందజేస్తున్న దృశ్యం

ఆకివీడు: క్షయ వ్యాధి జిల్లాలో తగ్గుముఖం పడుతోందని జిల్లా క్షయ వ్యాధి నివారణాధికారి, డిప్యూటీ డీఎంఅండ్ హెచ్ఓ భానూనాయక్ చెప్పారు. స్థానిక సీహెచ్‌సీలో బుధవారం క్షయవ్యాధి నివారణా వారోత్సవాల్లో భాగంగా వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రతి లక్ష మందిలో 250 మంది క్షయ వ్యాధిగ్రస్తులు ఉండేవారని, ప్రస్తుతం 150కి తక్కువగా ఉన్నారని చెప్పారు. జిల్లాలో ప్రస్తుతం 1250 మంది రోగులు ఉన్నట్లు తెలిపారు. వారికి మందులు, వైద్యం, పరీక్షలు, పౌష్టికాహారంతో పాటు రూ.1000 నెలకు కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్నట్లు చెప్పారు. అనంతరం స్థానిక ఆసుపత్రి సూపరింటిండెంట్ ఇన్‌చార్జి భువనను ఈ సందర్భంగా ఆయన సత్కరించారు. కార్యక్రమంలో వైద్యులు ఎండీ.నిజరిన్, సిబ్బంది పాల్గొన్నారు.